

వరి ధాన్యాన్ని లారీలో లోడింగ్ చేస్తున్న కార్మికులు



కొనుగోలు కేంద్రానికి విక్రయానికి వచ్చిన ధాన్యం

జోరుగా ధాన్యం కొనుగోళ్లు

- ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో నగదు జమ
- ఇప్పటివరకు 1,76,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- వంద శాతం సేకరణ పూర్తి చేసిన ఐదు కేంద్రాల మూత
- 15 రోజుల్లో కొనుగోళ్ల పూర్తికి యత్నం

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో వంద శాతం కొనుగోలు చేసిన ఐదు కేంద్రాలను అధికారులు మూసివేశారు. వచ్చేపక్షం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో 4,90,217 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేయగా, వాతావరణ పరిస్థితులతో దిగుబడులు తగ్గడంతో ధాన్యం అంచనా మేరకు కేంద్రాలకు రాలేదు. దీనికి తోడు పలువురు రైతులు ప్రైవేటు మార్కెట్‌లో ధాన్యం అమ్ముకున్నారు. ప్రస్తుతం 2024-25 యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 1,76,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు.

● జిల్లాలో కొనుగోళ్లు ఇలా...

జిల్లా వ్యాప్తంగా 427 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 137 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 289 కేంద్రాలు, మెప్మా ఆధ్వర్యంలో ఒకటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 24,093 మంది రైతుల వద్ద నుంచి రూ.409.48 కోట్ల విలువ గల 1,76,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో రూ.347.85 కోట్ల విలువ గల 1,49,934 మెట్రిక్ టన్నుల ధాన్యం ట్యాబ్‌ల్లో అప్‌లోడ్ చేశారు. రూ.281.14 కోట్ల విలువ గల 1,21,182 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మిల్లర్లకు పంపగా ట్రక్‌షీట్ జనరేట్ అయింది. ఇందుకు గాను 1,18,619 మెట్రిక్ టన్నులకు సంబంధించిన రూ.275.20 కోట్ల డబ్బులను 14,399 మంది రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

● 2.97 లక్షల ఎకరాల్లో వరి సాగు

యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,97,365 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో దొడ్డురకం ధాన్యం ఎక్కువగా ఉంది. అక్కడక్కడ సన్న రకం సాగు చేశారు. ఇందుకు గాను జిల్లాలో 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్న తొలుత అంచనా వేశా రు. ఈ మేరకు జిల్లా సహకార, మార్కెటింగ్, ఇందిరా క్రాంతిపథం, మెప్మా తదితర శాఖల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నుంచి కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు జరుపుతున్నారు. దిగుబడులు తగ్గడం వల్ల కేవలం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు రానున్నట్లు ప్రస్తుతం అంచనా వేస్తున్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

● బీఎస్ లత, అదనపు కలెక్టర్



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలను తీసుకుంటున్నాం. కొనుగోళ్ల వంద శాతం పూర్తి చేస్తాం. వచ్చే పక్షం రోజుల్లో పూర్తి స్థాయిలో కొనుగోళ్ల పూర్తి చేసే దిశగా పనిచేస్తున్నాం. సకాలంలో ధాన్యం కొనుగోళ్ల చేయడం, ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయడం, లారీల్లో లోడింగ్ చేయడం, మిల్లర్లకు రవాణా చేయడం, మిల్లుల్లో అన్‌లోడింగ్, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆర్మీ జవాన్లకు సంఘీభావంగా ర్యాలీ



జగిత్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పిన ఆర్మీ జవాన్లకు అభినందనలు తెలుపుతూ జగిత్యాలలో గురువారం రాత్రి జేఏసీ ఉద్యోగులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జేఏసీ ఉద్యోగులు ర్యాలీ చేశారు. పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్ చౌరస్తా వద్ద పలువురు జేఏసీ నాయకులు మాట్లాడారు. తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత దేశాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్న పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పడం భారతీయులందరికీ గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో జేఏసీ ఉద్యోగ సంఘ చైర్మన్ మిరియాల నాగేందర్ రెడ్డి, కన్వీనర్ కందుకూరి రవిబాబు, జిల్లా వైద్య అధికారి ప్రమోద్ కుమార్, ఉద్యోగ నాయకులు వకీల్, హకీమ్, వెంకట కిషన్, రామ్మోహన్, శ్రీనివాస్, గంగరాజం, హరికిరన్, ఆనందరావు, అమరేందర్ రెడ్డి, మహమూద్ పాల్గొన్నారు.

● కోరుట్ల: పట్టణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు భవనం వద్ద జాతీయ జెండాలతో ర్యాలీని జరిపారు. ర్యాలీ పట్టణంలోని గాంధీ రోడ్డు మీదిగా కార్గిల్, నందీ చౌరస్తా నుండి కోర్టు వరకు సాగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భైరి విజయ్ మాట్లాడారు. ఉగ్రవాదుల శిబిరాలను భారత సైనికులు ధ్వంసం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కసూర్తి రమేష్, కొంపల్లి సురేష్, సుతారి నవీన్ కుమార్ ఫసియోద్దీన్, మర్రిపల్లి గంగాధర్, రాజశేఖర్, గంధ్ర ప్రవీణ్ కుమార్, తోకల రమేష్, వినోద్, గాందారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మల్యాల: సైనికులకు మద్దతుగా మల్యాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి, కట్కం వినయ్, సంత ప్రకాశ్‌రెడ్డి, కంచర్ల లక్ష్మణాచారి, నరసింహరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు

● డీఏవో భాస్కర్



మాట్లాడుతున్న డీఏవో భాస్కర్

కొడిమ్యాల, మే8 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని పూడూర్ రైతు వేదికలో జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖతో అనుసంధానమై రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడి, పర్యావరణాన్ని కాపాడుకునే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాంతీయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ రైతులు జనుము, జీలుగ, పెసర, పచ్చిరొట్ట వంటి పంటలను సాగు చేసుకొని భూసారాన్ని పెంచుకోవాలన్నారు. ఆరుతడి పంటలు మొక్కజొన్న, కంది పంటలను వేసుకోవాలని సూచించారు. ఏవో జ్యోతి ఫార్మర్ రిజిస్ట్రీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, లోహియా ప్రతినిధి ఎన్. అనిల్, మాజీ సర్పంచు రాంరెడ్డి, ఏఈవోలు రాజేష్, శ్రీలత, గ్రీష్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రాయికల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో బాధిత కుటుంబాలను మాజీ మంత్రి జీవన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. గ్రామానికి చెందిన వాసరి రాయమల్లు, ధనరేకుల రాజ్ కుమార్‌లు ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడగా వారిని పరామర్శించారు. రామాజీపేట గ్రామంలో ఇటీవల మరణించిన బద్దం సత్తమ్మ, వెంకటనర్సయ్య కుటుంబాలను, రోడ్డు ప్రమాదంలో గాయపడిన నరేందర్‌ను పరామర్శించారు. రాయికల్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కన్నవేణి మల్లారెడ్డి కూతురు కన్నవేణి సంజనరెడ్డి మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

● పెగడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గుర్రం మురళి కుటుంబాన్ని, ల్యాగలమర్రి గ్రామానికి చెందిన వికాస్‌రెడ్డి కుటుంబాన్ని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు. మండల కేంద్రంలో పోస్ట్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న గుర్రంమురళి బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందగా, ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన వికాస్‌రెడ్డి కుటుంబాలను గురువారం పార్టీ నాయకులు ఓరుగంటి రమణారావుతో కలసి ఈశ్వర్ పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు లోక మల్లారెడ్డి, కరుణాకర్ రావు, బొమ్మెన స్వామి ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

● ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటోందని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం గొల్లపల్లి మండల రెవెన్యూ శివారులో నాబార్డు, ఆర్ఐడీఎఫ్ పథకాల ద్వారా మంజూరైన రూ.17 కోట్ల నిధులతో చేపట్టనున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం సొంత భవనం నిర్మాణం పనులకు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు విద్యనభ్యసించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం సొంత భవనం నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్మపురి మండలం మగ్గిడిలో ఉన్న గొల్లపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని వీలైనంత త్వరగా గొల్లపల్లి మండల కేంద్రానికి తరలించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం విద్యరంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. దీంతో ప్రభుత్వ విద్యా సంస్థలు అద్దె భవనాల్లో కొనసాగాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. అనంతరం మండల కేంద్రంలోని సర్వే నెం.735లోని ప్రభుత్వ స్థలంలో క్రీడా మైదానం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు, విద్యార్థులు, యువకులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌ను కలిసి క్రీడామైదానం కోసం స్థలాన్ని కేటాయించాలని చేసిన విజ్ఞప్తి మేరకు లక్ష్మణ్ కుమార్ రెవెన్యూ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అనువైన స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఆదర్శ విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

ఇటీవల ప్రకటించిన ఎస్సెస్సీ, ఇంటర్మీడియేట్ వార్షిక ఫలితాల్లో గొల్లపల్లి ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు అమోఘమైన ప్రతిభను కనబర్చి పాఠశాల ప్రతిష్టను ఇనుమడింపచేశారని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించి తమ ప్రతిభను చాటిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేలా తీర్చిదిద్దిన ప్రిన్సిపాల్ సుంకె రవి, ఉపాధ్యాయులను, లెక్చరర్లను ప్రభుత్వ విప్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్, వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

పెగడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని రామబద్రుని పల్లిలో గురువారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ నూతనంగా రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యాన్ని లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ ప్రారంభిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల కోసం పొరుగూరుకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడకూడదనే రామబద్రునిపల్లిలో రేషన్ సరుకుల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం సన్న బియ్యంతో కడుపునిండా తినాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెల్లరేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలి పారు. కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, నాయకులు ఒరుగల శ్రీనివాస్, కుమార్, లింగారెడ్డి, మధు, సంధి మల్లారెడ్డి పాల్గొన్నారు.

'క్రీడలతో మానసికోల్లాసం'



గెలుపొందిన క్రీడాకారులతో తహసీల్దార్ ఖయ్యూం

రాయికల్, మే 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని హైస్కూల్‌లో జిల్లా స్థాయి సబ్‌జూనియర్ బాల, బాలికల ఛాంపియన్‌షిప్ ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి వివేకవర్ధిని హైస్కూల్ గెలుచుకుంది. బాలుర విభాగంలో మొదటి బహుమతి నూకపెల్లి ప్రతిభ హైస్కూల్ గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ జి.గౌతమ్, సౌమ్య రెడ్డి, మల్లేశ్వరి, నవీన్, భీమేష్, యశ్వంత్, సుమంత్, సురేందర్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

కథలాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా గత ఏడాది చేపట్టిన పనులకు సంబంధించి ఈ నెల 9 నుంచి 14 దాకా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9న ఇప్పపల్లి, తుర్తి, 10న పోతారం, అంబారిపేట, కలికోట, పోసానిపేట, దూలూరు, 11న చింతకుంట, సిరికొండ, 12న ఊటపల్లి, 13న భూషణరావుపేట 14న తక్కళ్ళపల్లి, గంభీర్‌పూర్, తాండ్ర్యాల, కథలాపూర్, బొమ్మెన, దుంపెట గ్రామాల్లో సభలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉపాధి హామి కూలీలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు సభలకు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 15న మండల స్థాయిలో సామాజిక తనిఖీ వేదిక నిర్వహించి సిబ్బంది సేకరించిన వివరాలను వెల్లడిస్తారని పేర్కొన్నారు.

మాతృ మరణాల రేటు తగ్గించండి

● అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మాతృ మరణాల రేటును తగ్గించడానికి అవసరమైన కృషి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌తో కలిసి గత రెండు సంవత్సరాలలో జరిగిన మాతృ మరణాలపై వైద్యాధికారులు మరియు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్నట్లయితే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం వైద్యాధికారులు వారి యొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరిగినటువంటి మాతృ మరణాల నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుమన్ మోహన్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్లు జైపాల్‌రెడ్డి, డాక్టర్ ఎండి సమీయుద్దీన్, డాక్టర్ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ ఏ శ్రీనివాస్, పిల్లల వైద్య నిపుణులు పూర్ణచందర్, గైనకాలజిస్టులు డాక్టర్ పద్మిని, డాక్టర్ సాయి సుధా, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ కోట సుధీర్, వైద్యాధికారులు డాక్టర్ సతీష్, డాక్టర్ అంజిత్ రెడ్డి, డాక్టర్ సింధుజ, హెల్త్ ఎడ్యుకేటర్స్ భూమేశ్వర్, శంకర్ పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో రాము

ధర్మపురి, మే 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రాము కోరారు. ధర్మపురి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ (బాలికల) లో నిర్వహించే విద్యార్థుల సమ్మర్ క్యాంపును గురువారం ఆయన సందర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 10 వరకు చదివే విద్యార్థులకు వేసవి సెలవుల్లో ప్రభుత్వం ద్వారా ఎలాంటి అడ్మిషన్లు, ఫీజు లేకుండా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కనీస అభ్యాసన సామర్థ్యాలు పెంపొందుటకు, నీతి కథలు, ఉన్నత చదువుల పట్ల అవగాహన కలుగుతుందని ఆయన అన్నారు. చిత్ర లేఖనం, క్రీడా నైపుణ్యాలు పెంపొందించుటకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రావులపెల్లి శ్రీనివాస్, సంగనభట్ల సంజీవ్, అటుకుల స్వప్న, కాశెట్టి రమేష్, సీఆర్‌పీలు సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కల్వర్టును ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తిమృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన దాసారపు నర్సయ్య (66) అనే వ్యక్తి సింగరేణిలో రిటైర్డు అయి బెల్లంపల్లిలో నివాసం ఉంటున్నాడు. మానకొండూర్‌కు చెందిన కొండ్ర సంజీవ్ అనే వ్యక్తితో గురువారం నర్సయ్య కారులో పచ్చునూర్‌కు వెళ్లి మానకొండూర్‌కు తిరిగి వస్తున్నారు. అన్నారం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుకు కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందగా సంజీవ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు గురువారం ఢీట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ వైపు నుంచి హుజూరాబాద్ వైపు 52మంది ప్రయాణికులతో వెళ్తుంది. ఈ క్రమంలో వంకాయగూడెం శివారులో ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘనటలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు నమోదు చేసుకున్నారు.

మద్యం మత్తులో వరదకాలువలో పడి ఒకరి మృతి

మల్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వరద కాలువలో పడి గుర్రం నాగమల్లు(49) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్యాల మండలం సర్వాపూర్‌కు చెందిన గుర్రం నాగమల్లు కొంతకాలంగా కుటుంబసభ్యులతో కలిసి వేములవాడలో ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగమల్లు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల స్వగ్రామమైన సర్వాపూర్‌కు వచ్చిన నాగమల్లు మంగళవారం సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు వెతికారు. గురువారం గ్రామ శివారులోని వరదకాలువలో నాగమల్లు మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఐదుగురి అరెస్ట్

మల్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఐదుగురు నిందితులను పట్టుకున్నట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారంకు చెందిన ఓర్సు వనజ అనే మహిళ సోమవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకొని ఘాట్‌రోడ్డు మీదుగా తన కొడుకులతో దిగువ కొండగట్టుకు వస్తోంది. కారులో వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వనజ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణకు యత్నించగా ఆమె కిందపడిపోవడంతో నిందితులు కారులో పారిపోయారు. ఈ సంఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ నీలం రవి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మల్యాల బైపాస్ మార్గంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులోని ఐదుగురు అనుమానస్పదంగా కనిపించారు. దీంతో విచారణ జరుపగా చైన్‌స్నాచింగ్ దొంగలుగా గుర్తించామని ఎస్సై తెలిపారు. వారంతా కరీంనగర్‌కు చెందిన వారు కాగా దొంగతనాలే ప్రవృత్తిగా మరో చోరీ చేయడానికి వెళ్తూ పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు.


బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడి యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సురేందర్ కథనం మేరకు ధర్మారం మండలం కటికనపల్లి గ్రామానికి చెందిన కట్ట నవీన్(32) మరో ఇద్దరితో బైక్‌పై కరీంనగర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో ఆర్నకొండ శివారులో బుధవారం అర్ధరాత్రి తర్వాత బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. నవీన్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ఇద్దరికీ గాయాలైనట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం బైక్ అదుపుతప్పిన సంఘటనలో కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్జున్ తన ద్విచక్ర వాహనంపై గొల్లపల్లిలోని వివాహ వేడుకలకు హాజరై తిరిగి వెళుతున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.





- 'శాతవాహన'లో గందరగోళ పరిస్థితి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే పరీక్షలు నిర్వహించలేమని తేల్చిచెప్పిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- గడువు ముగిసినా పరీక్ష ఫీజులు చెల్లించని వైనం
- ఆందోళనలో డిగ్రీ విద్యార్థులు

పరీక్ష..ప్రశ్నార్థకం

గణేశ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు ప్రభుత్వం మూడేళ్లుగా విడుదల చేయలేదు. డిగ్రీ పరీక్షలు నిర్వహించలేమని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. దీంతో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల 14 నుంచి డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్స్ పరీక్షలు ప్రారంభంకావాల్సి ఉంది. ప్రైవేటు కళాశాలలు చేతులెత్తేయడంతో వర్సిటీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశలో పరీక్షలను ఆకస్మికంగా వాయిదా వేయవలసిన పరిస్థితులు తలెత్తాయి. పరీక్షలు వాయిదా పడితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 వేల మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు 84 ఉన్నాయి. వీటిలో 36 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయి లు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు పరీక్షలు నిర్వహించలేమని ప్రకటించాయి. ఫీజుబకాయిలను పరీక్షలకు ముడిపెట్టొద్దని వర్సిటీ అధికారులు కళాశాలల ప్రతినిధులకు నచ్చ చెబుతున్నా.. వారు వినడం లేదు.

కష్టంగా కళాశాలల నిర్వహణ :

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 84 డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వాటి 15 ప్రభుత్వ కళాశాలలు, ఎనిమిది ట్రైబల్, సోషల్, వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి. రెండు ఎయిడెడ్, 59 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటికి కోట్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉన్నాయి. దీంతో కళాశాలల నిర్వహణ, అధ్యాపకుల వేతనాలు, వర్సిటీకి చెల్లించాల్సిన గుర్తింపు ఫీజులు భారంగా మారాయని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో పరీక్షల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు పూర్తికాగా.. శాతవాహన పరిధిలో డిగ్రీ పరీక్షలపై ప్రతిష్టంభన నెలకొంది. డిగ్రీ చివరి సెమిస్టర్ విద్యార్థులు మాత్రం తాము పోటీపరీక్షలకు అనర్హులమవుతామని.. పరీక్షలు నిర్వహించాలనిలని కోరుతున్నారు.

అయోమయ పరిస్థితి నెలకొంది

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘం నాయకుడు



శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తారో.. లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఉన్నత చదువులకు, ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన సమయంలో విద్యార్థులు పరీక్షలు ఉంటాయో ఉండవో అనే అయోమయంలో పడిపోయారు. చదువులపై దృష్టి సారించలేకపోతున్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరీక్షలు వెంటనే నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలి.

బకాయిలు ఇచ్చేంత వరకు పరీక్షలు నిర్వహించలేం

ఎం వెంకటేశ్వరావు, సుప్మా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



మూడు సంవత్సరాల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం బకాయిలు ఇచ్చేంత వరకు పరీక్షలు నిర్వహించలేమని వైస్ చాన్సలర్‌కు సుప్మా సభ్యులందరం కలిసి చెప్పాము. ప్రభుత్వం గతంలో చాలా సార్లు మాట ఇచ్చి మాట దాటవేసింది. ఐదు యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు బహిష్కరించాము.

బకాయిలను విడుదల చేయాలి

కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రంలో ఉస్మానియా మినహా మిగతా ఐదు యూనివర్సిటీల్లో డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు జరగడం లేదు. కళాశాల యాజమాన్యాలు పరీక్ష ఫీజులను యూనివర్సిటీలకు చెల్లించలేదు. దీంతో ప్రధానంగా మూడో సంవత్సరం విద్యార్థులు భారీగా నష్ట పోయే అవకాశం ఉంది. వారు సెమిస్టర్ పరీక్షలు రాసి పాసై పోటీ పరీక్షలు రాయడానికి, పీజీ సెట్ రాయడానికి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. డిగ్రీ విద్యార్థుల్లో దాదాపు 80 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారపడి చదువుకునేవాళ్లే ఉన్నారు.

ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేయొద్దు..

రాచమల్ల రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్



గత ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వమూ అదే దారిలో పయనిస్తోంది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. స్కాలర్‌షిప్‌లను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేయాలి.

భార్య, అత్తామామల వేధింపులకు యువకుడి బలి

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): భార్య, అత్తమామల వేధింపులు భరించలేక యువకుడు మరణించిన సంఘటన గురువారం చొప్పదండిలో జరిగింది. ఎస్ఐ సురేందర్ కథనం మేరకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కరం గ్రామానికి చెందిన ఉండాటి సతీష్(30)కు చొప్పదండికి చెందిన కళతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు ఉన్నాడు. పెళ్లి నాటి నుంచి సతీష్ అత్తగారింట్లో ఉంటుండగా అత్త మానుపాటి రాజవ్వ, మామ మానుపాటి కనుకయ్య, భార్య కళతో పాటు మరదలు వేధింపులు భరించలేక గురువారం ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందినట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు. మృతుడు సతీష్ తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కక్షలతో ఒకరిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న గంగారెడ్డి

కోరుట్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల రూరల్ మండలం జోగినిపల్లి గ్రామంలో పాత కక్షలతో గంగారెడ్డి అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నవీన్ గురువారం కత్తితో దాడి చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్ల నవీన్, ముక్కెర గంగారెడ్డిలు ఇద్దరు బర్రెల కాపరులు. వీరి మధ్య గతంలో పాత కక్షలు ఉండేవి. గురు వారం ఉదయం గ్రామంలో ఓ హోటల్ వద్ద ముక్కర గంగారెడ్డి టీ తాగుతుండగా నవీన్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన చుట్టుపక్కల వారు వారించడంతో నవీన్ అక్కడి నుంచి పరారయ్యాడు. గంగారెడ్డిని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి బంధువులు తరలించారు. గంగారెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు కూలి నిర్ణయించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



సిరిస్లిల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి సంఘాల మహిళల కోసం అందించే చీరలను తయారుచేసే కార్మికులకు కూలి నిర్ణయించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులు బైక్‌ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మరమగ్గాల, వార్పిన్, వైపని కార్మికులు తాము తయారు చేసే చీరలకు కూలి నిర్ణయించడంతోపాటు యజమానులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న మహిళా పొదుపు సంఘాల సభ్యులకు అందించే చీరలకు సంబంధించి మరమగ్గాల, వార్పిన్, వైపని అనుబంధరంగాల కార్మికులకు మెరుగైన వేతనం వచ్చే విధంగా కూలి పెంచాలని నెల రోజుల క్రితం సమ్మె చేసిన ఫలితంగా ప్రభుత్వం యాజమానులకు ఒక మీటర్‌కు అదనంగా రెండు రూపాయల ధర పెంచిందన్నారు.

కానీ యజమానులు మాత్రం కార్మికులకు కూలి పెంచి ఇవ్వడం లేదన్నారు. దీని వలన కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. కలెక్టర్ స్పందించి యజ మానులతో చర్చలు జరిపి కార్మికులకు కూలి నిర్ణయించే విధంగా చర్యలు తీసుకో వాలని కోరారు. కార్యక్రమంలో వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లే సత్యం, ఉడుత రవి, మచ్చ వేణు, బూట్ల వెంకటేశ్వర్లు, ఐరేనీ ప్రవీణ్, అవదూత హరిదాసు, అడిచర్ల రాజు, శ్రీకాంత్, రమేష్, మధు, శంకర్, సదానందం, శ్రీనివాస్, రాజశేఖర్, సతీష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతుల రాస్తారోకో



ఫాజుల్ నగర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

వేములవాడ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని గురువారం ఫాజుల్‌నగర్ గ్రామంలో రైతులు బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలు ఉన్న కారణంగా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా లారీలు లేనందున ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 20వ నంబర్ నడుస్తుందని 150 నెంబర్ వరకు లైన్ ఉందన్నారు. స్థానిక అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వీలైనంత వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ శాఖ నాయకుడు చిందం కుమార్, పోగుల రాకేష్, పెద్దకుర్మ మల్లేశం, కొండవేని మోహన్, మునిందర్‌రెడ్డి, ఎగుర్ల రాజు, అంజయ్య, ఓదేలు, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

లక్నోలో నాబార్డు రెండు రోజుల జాతీయ సదస్సు

- ప్రారంభించిన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



జాతీయ సదస్సులో ప్రతినిధులతో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా సహకార సంస్థల బలోపేతం కోసం నాబార్డు ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం నాఫ్స్‌కాబ్ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. సహకార సంస్థల్లో షేర్ సర్వీసెస్ ఎంటిటీ, సహకారంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించినున్నారు. ఈ సందర్భంగా నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార బ్యాంకుల బలోపేతం కోసం అమిత్‌షా నాయకత్వంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తీసుకున్న వివిధ లాభాలు, నష్టాలను చర్చించడానికి, తగిన చర్యల కోసం తీసుకున్న చొరవను స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు దీర్ఘకాలంలో చిన్న సహకార బ్యాంకులకు ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు. ఈ సదస్సులో సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్ కుమార్ బుటానీ, జాయింట్ సెక్రటరీ సిద్ధార్ జైన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఆర్‌సీఎస్ సౌరబ్ బాబు, నాబార్డు చైర్మన్ షాజీ కేవీ, నాబార్డు డీఎండీ గోవర్ధన్ రావత్, సహకార రంగంలోని ఐటీ, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీకి ఉత్తమ పనితీరు అవార్డు

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి స్వయం సహాయ బృందాల అనుసంధానంలో రాష్ట్రస్థాయి 'ఉత్తమ పనితీరు అవార్డు' లభించింది. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీసీసీబీ సీఈవో ఎన్ సత్యనారాయణ అందుకున్నారు. స్వయం సహాయక సంఘాల జీవనోపాధిని మెరుగుపర్చడంలో నిరంతర రుణ సహాయాన్ని అందిచినందుకు కేడీసీసీబీకి ఈ అవార్డు లభించింది.



మంత్రి సీతక్క నుంచి అవార్డు అందుకుంటున్న కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణ

మైనార్టీ గురుకులాల సొసైటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌కు డాక్టరేట్



కనపర్తి సురేష్

కరీంనగర్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మైనార్టీ గురుకులాల సొసైటీ రీజనల్ కో-ఆర్డినేటర్ కనపర్తి సురేష్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. అమితవ్ ఘోష్ ఎంపిక చేసిన నవలల్లో థీమాటిక్ స్టడీ అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మెలిస్సా హెల్ పర్యవేక్షణలో ఆంగ్ల సాహిత్యంలో సమర్పించిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండికి చెందిన సురేష్ డాక్టరేట్ లభించడంపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు పలువురు ఆయనను అభినందించారు.

ఇసుక డంపు స్వాధీనం

ఎండపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుపల్లి గ్రామంలో ఎనిమిది ఇసుక డంపులు ఉన్నాయనే సమాచారంతో గురువారం ఎండపల్లి ఆర్ఐ దొంత రాజేశ్వరి నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీన పరుచుకున్నారు. ఎనిమిది ట్రాక్టర్ల ఇసుకను వేలం పాట నిర్వహించగా ఏడు వేలు రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆర్ఐ రాజేశ్వరి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా ఎవరు చేపట్టినా వాటిని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హెచ్చరించారు.

ప్రతీ పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం : విప్



బస్సు వద్ద ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ప్రజలు

పెగడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లె కు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించి, ప్రజల ప్రయాణ బాదలు తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని రామబద్రునిపల్లిలో గురువారం బస్ సర్వీస్‌ను కరీంనగర్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌తో కలసి ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రామబద్రుని పల్లి, ల్యాగలమర్రి, ఎల్లాపూర్, కీచులాటపల్లి, రాజారాంపల్లి తదితర గ్రామాల ప్రజల వినతుల మేరకు బస్ సర్వీస్ సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు.

చిరుతల భజనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్





చిరుతల రామాయణాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు, జ్ఞాపికను ప్రదానం చేస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 8 : ప్రాచీన గ్రామీణ కళారూపమైన చిరుతల భజనకు ప్రపంచ ప్రఖ్యాతి తీసుకరావాలనే ఉద్దేశ్యంతో కళాభారతిలో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్, సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్త నిర్వహణలో 8 గంటల పాటు నిర్విరామ చిరుతల భజన చేశారు. ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 600 మంది కళాకారులు ప్రత్యేక వేషధారణలో చిరుతల మోతలతో, చక్కని పాటలతో, గజ్జెలు కట్టి ప్రత్యేక విన్యాసాలు చేస్తూ ప్రదర్శన ఇచ్చారు. రికార్డు నమోదుకు ప్రతినిధిగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి బింగి నరేందర్ హాజరయ్యారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆర్‌డీవో సీహెచ్ మహేశ్వర్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ సువార్త ఈవెంట్ రికార్డులో నమోదైనట్లు ప్రకటించారు. నిర్వాహకులు జి కృపాదానం, డాక్టర్ విష్ణుదాసు గోపాలరావు, సల్వాజి ప్రవీణ్‌కు రికార్డు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, టీం లీడర్లకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందజేశారు.

పీజీ కళాశాలలో భవన నిర్మాణానికి భూమి పూజ


పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, పక్కన ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

కోల్‌సిటీటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సుమారు 10లక్ష రూపాయల వ్యయంతో ఎంబీఏ భవనం, 13లక్షల రూపాయలతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యార్థులకు అవసరమయ్యే వివిధ రకాల మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ అకాడమిక్ బ్లాక్‌తోపాటు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ని ప్రారంభించారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ఓఎస్‌డీ టూ వీసీ డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురే ష్‌కుమార్, శాతవాహన యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్, ఇంజనీర్ ప్రకాస్‌రావు, సంతోష్‌కుమార్, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, అజయ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాల ఏర్పాట్లపై ఆర్టీసీ ఈడీ సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈడీ సోలమన్

భగత్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమం స్థానమైన కాళేశ్వరంలో (గోదావరి, ప్రాణహిత, సరస్వతి) సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో పనులను పరిశీలించి బస్సుల ఏర్పాట్లపై అధికారులతో ఆర్టీసీ జోన్ ఈడీ పగిడిమర్రి సోమలన్ సమీక్ష నిర్వహించారు. సరస్వతి పుష్క రాలకు కరీంనగర్ జోన్‌లోని వివిధ రీజియన్‌ల నుంచి నడిపే బస్సులకు సంబంధించి చేస్తున్న ఏర్పాటు పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ బి రాజు, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భానుకిరణ్, ఎస్ భూపతిరెడ్డి, భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందిర, ఈడి కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కరీంనగర్-వరంగల్ రూట్‌లో డీలక్స్ ప్రయాణికులకు పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్-వరంగల్ రూట్‌లో డీలక్స్ బస్సులలో (డీజిల్, ఎలక్ట్రికల్) ప్రయాణ చార్జీలో పది శాతం రాయితీ ఉందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మెట్‌పల్లి రూరల్, మే, 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండలింగాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో ఉంచి శోభాయాత్రగా జగ్గసాగర్ గ్రామంలోని కొండస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయంలో ఏర్పాటు చేసి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, అర్చనలు తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈనెల 9న ఆలయంలో నిర్వహించే స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆన్‌లైన్‌లో రాజన్న సేవలు

భక్తులు ముందే బుక్ చేసుకునే అవకాశం
దూరప్రాంత భక్తులకు తప్పనున్న ఇబ్బందులు



వేములవాడ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో చేపట్టే సేవలను భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చారు. నిత్యం రాష్ట్రంతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులతో రద్దీగా మారుతున్న సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సేవలను ఆన్‌లైన్ చేశారు. రాజన్న ఆలయంలో నిత్యం నిర్వహించే పూజల వివరాలు తెలియక భక్తులు రాజన్నను దర్శించుకుని తిరిగి ప్రయాణమయ్యే వారు. అయితే రాజన్న ఆల యానికి వచ్చే భక్తులు ఎక్కడున్నా తమ ఫోన్‌లో ఆన్ లైన్ ద్వారా వారం రోజుల ముందే తాము చేయిం చుకునే పూజలను బుక్ చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తీసుకువచ్చారు. రాజన్న ఆలయంతో పాటుగా శ్రీనగరేశ్వర, బద్దిపోచమ్మ, శ్రీలక్ష్మీనర్సింహ స్వామి, శ్రీభీమేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వహించే నిత్య, శాశ్వత పూజల వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరిచారు. భక్తులకు తమకు కావాల్సిన టికెట్లను వేములవాడ టెంపుల్.తెలంగాణ.గౌట్. ఇన్ అనే వెబ్ సైట్‌లో బుక్ చేసుకునేలా అందుబాటులోకి తీసుకవచ్చారు.

ఆది, సోమవారాల్లో గర్భాలయ సేవలు రద్దు..

రాజన్న ఆలయానికి ప్రతి ఆది, సోమవారం రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ఆది, సోమవారాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గర్భగుడిలో నిర్వహించే పూజలను నిలిపివేశారు. అభిషేకం, అన్నపూజ, ఆకు పూజలను నిలిపివేసి మిగతా సేవలు కొనసాగిస్తారు.

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారికి శాశ్వత పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. శాశ్వత పూజలు 10సంవత్సరాల వరకు వర్తిస్థాయి. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే పూజలు చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. శాశ్వత పూజల వివరాలు.. రుద్రాభిషేకం రూ.3000, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం రూ.1500, అన్నపూజ రూ.1000, శివకల్యాణం రూ.5000, మహాలింగార్చన రూ.3000, కుంకుమ పూజ రూ.1000, కోడెపూజ రూ.1000గా నిర్ణయించారు.

వాహనాల పూజల వివరాలు..

లారీ, బస్సు, కారులకు రూ.400, ఆటో, టెంపో రూ.250, మోటార్‌సైకిల్ రూ. 100గా ఉన్నాయి. రాజన్న దర్శనం కోసం వెళ్లే భక్తులు శీఘ్ర దర్శనం టికెట్ ఒక్కరికి రూ.100, బ్రేక్‌దర్శనం ఒక్కరికి రూ.300 ధరలు ఉన్నాయి. రాజన్న ప్రసాదాల వివరాలు... లడ్డూ, బోగం రూ.700, సిరా బోగం రూ. 600, పులిహోర బోగం రూ. 200, దద్దోజనం రూ. 300, లడ్డూ ఒక్కటికి రూ. 20, అభిషేకం లడ్డూ రూ. 100, పులిహోర ఒక్కటి రూ.15.

వసతి గదుల వివరాలు..

వేములవాడ రాజన్న ఆలయ పరిధిలోని ఆయా వసతి గదు ల్లోని రూముల ధరల వివరా లు.. భీమేశ్వర సదన్ గెస్ట్‌హౌస్ రూ.2800, భీమేశ్వర ఏసీ సూట్ రూ.1600, భీమేశ్వర సదన్ ఏసీ ఒక్క రూమ్ రూ.1344, నందీశ్వర ఏసీ సూట్ రూ.2800, నందీశ్వర ఏసీ రూమ్ రూ.1008, నందీశ్వర నాన్ ఏసీ రూమ్ రూ. 500, అమ్మ వారి అతిథిగృహం రూ.1600, పార్వతి పురం బ్లాక్‌లు రూ.672, పార్వతి పురం రూమ్ రూ.336, లక్ష్మగణపతి కాంప్లెక్స్ ఒక్క రూమ్ రూ.448.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదనే ఆన్‌లైన్ సేవలు
వినోద్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తున్నారు. భక్తులకు రాజన్న ఆలయంలో నిర్వహించే పూజల వివరాలు తెలియాలనే ఉద్దేశ్యంతోనే ఆన్‌లైన్‌లో ఉంచాము. దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులు వారం రోజుల ముందే తమ ఫోన్ ద్వారా నిమిషాల్లో టికెట్స్, రూమ్‌లు బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించాము. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఆన్‌లైన్ సేవలను సద్విని యోగం చేసుకోవాలి.

నిత్య పూజల వివరాలు..

రుద్రాభిషేకం (మహామండపం) రూ. 1000, కోడెమొక్కు రూ. 200, అభిషేకం (నాగిరెడ్డి మండపం) రూ. 500, అన్న పూజ రూ.500, అన్నపూజ గర్భగుడిలో రూ. 1000, ఆకు పూజ రూ. 1000, కుంకుమ పూజ రూ.300, శివకల్యాణం రూ. 1500, చండీ సహిత రుద్రహోమం రూ. 1516, మహాలింగా ర్చన రూ. 1000, పెద్ద సేవ రూ.350, పల్లకీ సేవ రూ. 200, సత్యనారాయణ వ్రతం రూ.600 కాగా, శ్రీభీమేశ్వరస్వామి ఆల యంలో పూజల వివరాలు శ్రీభీమేశ్వర అభిషేకం రూ. 516, నవగ్రహ పూజ రూ.516, ద్వాదశ జ్యోతిర్లింగాల అభిషేకం రూ.516గా ఆన్‌లైన్ చేశారు.



కాల్షియం కార్బైడ్ నిల్వల గోదాంలో అధికారుల సోదాలు


సోదాలు చేస్తున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తీన్‌ఖానీ చౌరస్తా సమీపంలో గల ఓ గోదాంలో నిబంధనలకు విరుద్ధంగా కాల్షియం కార్బైడ్ బాక్స్‌లను పెద్దఎత్తున నిల్వ చేశారన్న సమాచారంతో పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. సదరు గోదాంలో సీలు గల బాక్సుల్లో ప్యాకెట్లు నిల్వచేయడాన్ని గుర్తించారు. సుమారు గంట పాటు పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు చేశారు. సహజసిద్ధంగా పండాల్సిన మామిడి, ఇతర పండ్లను కృతిమ పద్ధతిలో త్వరగా పండేలా నిర్దేశిత ప్రమాణాలకు మించి కాల్షియం కార్బైడ్ వినియోగంలో మగ్గబెట్టడానికి కొన్ని నిషేధిత కంపెనీలు, నాసిరకం కంపెనీలకు చెందినవి ఉన్నట్లు అనుమానించి పలు బాక్సులను పట్టుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): బీటెక్ మొదటి సంవత్సరంలో మార్కులు తక్కువ వచ్చాయని జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కన్నవేణి సౌజన్యరెడ్డి అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల సీఐ వేణుగోపాల్ తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన కన్నవేణి మల్లారెడ్డి కూతురైన సౌజన్యరెడ్డి హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. గురువారం ఉదయం లేచి చూసేసరికి హాల్లో ఉరి వేసుకుని మృతిచెంది ఉంది. మృతురాలి తండ్రి పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ధర్మపురిలో వైభవంగా చందనోత్సవం



యోగా నరసింహ స్వామి వారలను చందనంతో అలంకరణ చేసి హారతి ఇస్తున్న అర్చకుడు, స్వామి వారి పూజల్లో పాల్గొన్న భక్తులు

- భారీగా దర్శనం చేసుకున్న భక్తులు

ధర్మపురి, మే 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం చందనోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యోగ, ఉగ్ర నారసింహులను అందంగా చందనంతో అలంకరించారు. లోక కల్యాణార్థం సుదర్శన, నారసింహ, రుద్ర హోమాలు నిర్వహించారు.

గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఆలయాలు నరసింహ నామస్మరణలతో ప్రతిధ్వనించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీసీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నరసింహుని సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు

నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం సందర్శించారు. అనంతరం ఆయన చందనోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు అందించి సన్మానించారు.


ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ప్రసాదం అందజేస్తున్న అధికారులు

మానసాదేవి ఆలయంలో సప్తమ వార్షికోత్సవాలు ప్రారంభం


అమ్మవారికి పసుపుతో అభిషేకం చేస్తున్న వేద పండితులు

గన్నేరువరం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకల్లో ఉదయం నుండి గణపతి హోమాలు, మానసాదేవి, అపురూపలక్ష్మి అమ్మవార్లకు 54 కిలోల పసుపు, కుంకుమలతో అభిషేకాలు ఆలయ ప్రధాన అర్చకుడు అమర్‌నాథ్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'శాతవాహన' పరిధిలో 15 నుంచి బీఎస్సీ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో బీఎస్సీ ఆనర్స్ (4 సంవత్సరాల కోర్స్)లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 15 నుంచి ప్రారంభమై మే 30కి ముగు స్తాయని, బీఎస్సీ ఆనర్స్‌లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు కంప్యూటర్ సైన్స్‌లో, రెండవ సెమిస్టర్ బయో మెడికల్ సైన్స్‌లో జరగనున్నట్టు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.డి.సురేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని ఇతర వివరాలకు కళాశాలలో గాని, విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.




సెలవుల్లో ఉత్సాహంగా

● 'స్వచ్ఛ' హుజూరాబాద్‌లో భాగంగా వేసవి శిక్షణ శిబిరం ● మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు


హుజూరాబాద్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

హుజూరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛ హుజూరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ మైదానంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జడ్జి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్యారం, చందరంగం, కరాటే, క్రికెట్, ఖోఖో, హాకీ తదితర ఆటల పోటీల్లో పీఈటీల ఆధ్వర్యంలో నేర్చుకుంటున్నారు. పిల్లలు ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్, టీవీల వైపు మొగ్గు చూపకుండా ఉండేందుకు క్రీడలు అలవాటు చేస్తున్నారు. ఈ క్రీడాకారులకు డాక్టర్ నవీన్, న్యాయవాది ముక్కెర రాజు, సారయ్యలు టీషర్ట్స్, బిస్కెట్స్, పండ్లు, పాలు అందిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆటలను ప్రోత్సహిస్తుండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో హైస్కూల్ మైదానం విద్యార్థులతో కిక్కిరిసిపోతోంది.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకే క్రీడల్లో శిక్షణ
సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్



వేసవిలో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు స్వచ్ఛ హుజూరాబాద్‌లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మున్సిపల్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు ఇంట్లో ఉంటే సెల్‌ఫోన్, టీవీలకు అలవాటు పడకుండా క్రీడలు దోహదపడుతాయి. పిల్లలను తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఖోఖో, హాకీ, వాలీబాల్, క్రికెట్, చందరంగం, క్యారం తదితర క్రీడల్లో విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ పిల్లలకు దాతలు ముందుకు వచ్చి పండ్లు, పాలు, బిస్కెట్స్ అందజేస్తుండటం అభినందనీయం.



క్యారం, చందరంగం ఆడుతున్న విద్యార్థులు

సైలెన్సర్లు మార్చి ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్


సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): సైలెన్సర్లు మార్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. అధిక శబ్దం కలిగించే 130 మాడిఫైడ్ సైలెన్సర్లను గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొన్ని రోజులుగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తు ద్విచక్ర వాహనదారులు సైలెన్సర్లను మాడిఫై చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందుల కలుగజేస్తున్న 130 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి సైలెన్సర్‌ను ధ్వంసం చేసినట్టు వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని అన్నారు. శబ్ధ కాలుష్యాన్ని నిరోదించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాడిఫై సైలెన్సర్‌లను వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కా ర్యక్రమంలో డీఎస్పీ రఘుయందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్‌ఖాన్, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

జగిత్యాలరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చల్‌గల్ ఏఎంసీ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అవకత వకలకు తావులేకుండా సక్రమంగా కొను గోళ్లు చేపడుతున్నామని జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి హమాలీ కొరత లేకుండా మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని 3 కాంటాల ద్వారా ఎప్పటి కప్పుడు రైస్ మిల్లులకు పంపిస్తున్నామన్నారు. సెంట ర్‌లో కొందరు గిట్టని వ్యక్తులు రైతులను తప్పుదోవ పట్టిస్తు న్నారని పేర్కొన్నారు. అసత్యపు మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. సక్రమంగా రిజిష్టర్లలో రైతుల వివరాలు నమోదు చేస్తూ సీరియల్ నంబర్ ప్రకారం కాంటలు వేస్తున్నామన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

జగిత్యాలరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లోని బాలపల్లి గ్రామంలో గురువారం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈసందర్భంగా 131 తెల్లజాతి పశువులకు, 138 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని తెలిపారు. పాడి యజమానులు పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

పెగడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని నందగిరిలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గేదెలకు, ఆవులకు, గేదె దూడలకు, ఆవు దూడలకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మతిన్, జానీ పాష, మాజీ వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, డైరీ కార్యదర్శి తోట మల్లేశం, మహిపాల్ రెడ్డి, జగన్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజారాం తండా పంచాయతీ కార్యదర్శిగా నరేశ్

కథలాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజారాం తండా గ్రామపంచాయతీ కార్యదర్శిగా జె నరేశ్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం విధుల్లో చేరారు. బుగ్గారం మండలంలోని వెల్దండిలో పనిచేసి సెలవులో ఉండగా ఇక్కడికి బదిలీ చేశారు. ఇప్పటి దాకా దుంపెట పంచాయతీ కార్యదర్శి ఇన్‌ఛార్జ్‌గా కొనసాగారు.

ఆర్థిక సహాయం

కొడిమ్యాల, మే 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కల్లెపల్లి చంద్రయ్య ఇటీవల మృతి చెందగా మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం కొడిమ్యాల యువకులు 20వేల రూపా యలను పోగు చేసి మృతుని చిన్న కూతురు పేరున డిపాజిట్ చేశారు. పాస్ బుక్‌ను చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, అజయ్, శంకర్, సురేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువ

-భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా బుగ్గారం మండలం ఎంపిక -రెండు గ్రామాల్లో 235 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మజీద్

బుగ్గారం మే8 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సులకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. జిల్లాలో బుగ్గారం మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈనెల 5వ తేదీ నుండి బుగ్గారం మండలంలో భూభారతి పైలట్ ప్రాజెక్టు రెవెన్యూ సదస్సులను ప్రారంభిం చారు. మండలంలో రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా ప్రతి గ్రామంలో రెండు రోజుల రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. మొదటి బృందంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ప్రత్యేక అధికారిగా, రెండో బృందంలో బుగ్గారం తహసీల్దార్ మజీద్ సదస్సును నిర్వహిస్తున్నారు.

ఈనెల 5,6 తేదీల్లో యశ్వంతరావుపేట్, మద్దునూర్‌లో సదస్సులు నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో 235 దరఖాస్తులు వచ్చాయి. 7న శకల్లలో నిర్వహించారు. 8న సిరికొండ, 9 నుండి 12న వెలుగొండ, గంగాపూర్, 13,14,వ గోపులాపూర్ సిరివంచ కోట, చిన్నాపూర్, 15,16న బుగ్గారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా బుగ్గారం ఎంపిక చేయడంతో మండల రైతులు దరఖాస్తులు ఇస్తు న్నారు. ధరణి రికార్డుల సవరణలో తప్పుగా ఒకరి భూమి మరొకరికి పడడంతో నేటి వరకు రైతులు ఇబ్బంది పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం లో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాతో రెవెన్యూ సదస్సులలో రైతులు దరఖాస్తు చేసుకుంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● వచ్చిన దరఖాస్తులు

మండలంలోని యశ్వంతరావుపేట్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 80 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సర్వేనెంబర్ మిస్సింగ్ 10, పెండింగ్ మ్యూటేషన్ 2 డిఎస్ పెండింగ్ 1, ఎక్సటెంట్ కరెక్షన్ 15, అసైన్ ల్యాండ్ 6, విరాసత్ 17సాదా బైనామా 26, ఇతర 3దరఖాస్తులు వచ్చాయి. మద్దునూరు గ్రామంలో మొత్తం దరఖాస్తులు 155 వచ్చాయి. ఇందులో మిస్సింగ్ సర్వే నెంబర్ 17, పెండింగ్ మ్యూటేషన్ 3, డిఎస్ పెండింగ్ 1, ఎక్సటెంట్ కరెక్షన్ 9, అసైన్ ల్యాండ్ 5, విరసత్ 27 సాదా బై నామ 88, ఇతర 4,దరఖాస్తులు వచ్చాయి.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి -తహసీల్దార్ మజీద్



భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వ హిస్తున్న రెవెన్యూ సదస్సు లను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రెండు బృందాలుగా ప్రతి గ్రామంలో రెండు రోజులు సదస్సులను నిర్వహిస్తున్నాం. ఈనెల 16 తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తున్న సందర్భంగా భూ సమస్యలు ఉన్న ప్రతి రైతు దరఖాస్తు చేసుకొని వారి సమస్యలను తీర్చుకోవాలి.

ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నా -రవీందర్, రైతు, యశ్వంతరావు పేట



యశ్వంతరావు పేట గ్రామ శివారులోని సర్వే నెంబర్ 93లో నాకు 10 గుంటల భూమి ఉంది. ఆ భూమి వేరే వాళ్ల పేరు మీదుగా తప్పుగా నమోదైంది. భూమి నా పేరు మీద రావాలని ఎనిమిదేళ్లుగా దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్నా. ప్రస్తుతం భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్నా. నా సమస్య పరిష్కారం అవుతుందని ఆశతో ఎదురుచూస్తున్నా.

'పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి'

గొల్లపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.భోనగిరి నరేష్ పాడిరైతులకు సూచించారు. గురువారం గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో డైరీ ఫార్మ్ రైతులు పశువులకు తీసుకో వాల్సిన జాగ్రత్తల గూర్చి, పాల దిగుబడి పెరగడానికి పాటించాల్సిన మెలకువల గూర్చి పాడి రైతులకు అవగాహన కల్పించారు. మల్లన్నపేట, శంకర్రావు పేట గ్రామాల్లో 350 ఆవులు, ఎద్దులు, గేదేలు,, దూడలకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి డా.రవీందర్ తెలిపారు. ఇప్పటివరకు మండలంలోని 20 గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. మిగిలిన గ్రామాల్లో అతి త్వరలో పూర్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని మండల పశువైద్యాధికారి తెలిపారు.

ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ రాజశ్రీ, నర్సయ్య, రవీంధర్, శ్రీకాంత్ నిశాంత్, రమేష్ తదితర పశువైద్య సిబ్బందితో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

'సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బీర్‌పూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పొలాస వ్యవసాయా కళాశాల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యలయ ఆవరణలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వివిధ పంటల సాగు, ఆధునీక పద్ధ తులు, పంట నష్టపరిహారం, ఎరువుల వినియోగం, తక్కువ యూరియా వాడి సాగు ఖర్చులు తగ్గించు కోవడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడి పాటించడం, చెట్లను పెంచడం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ సైదా నాయక్, శేషు, వ్యవసాయ అధికారులు, మాజి ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేత

కొడిమ్యాల, మే 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం క్రికెట్ క్రీడాకారు లకు మండలంలోని తిర్మాలాపూర్ మాజీ ఎంపీటీసీ మర్రిపెల్లి శంకర్ టీ షర్టులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు ఆదిరెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మల్లాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోని 1999-20 సంవత్సర పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల రజతోత్సవ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. గురువారం పాఠశాల అవరణంలో స్టేజి గద్దె నిర్మాణం చేయ డానికి భూమి పూజ చేశారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు పాలు పంచుకోవడం చాలా అభినందనీయమని ఉపాధ్యాయులు కొనియాడారు. అనంతరం గ్రామంలోని కేఎమ్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి వేడుకలు నిర్వహించారు. 25 సంవత్సరాల తరువాతం కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరిఒకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని గతంలోని స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆట పాటలతో వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వుదగిరి రాజం, జంగం గంగనర్సయ్య, సుంచుల నర్సయ్య, చెర్ల విజయ్‌రాజ్, శ్రీపెరంబుదూరి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



ఎంపీడీవోను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్, మే, 8 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మండ్లు కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో శశికుమార్‌రెడ్డిని కలిసి సన్మానించారు. అనంతరం మండలంలోని సమస్యలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కరం, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా చూడాలని ఎంపీడీవోను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగుల శ్రీనివాస్, పుప్పాల వినోద్, నూతిపల్లి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

మెట్‌పల్లి రూరల్, మే8 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ బోనాల పండుగను గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఊరేగింపుగా గ్రామంలోని పుర వీధుల గుండా డప్పు చప్పుల మధ్య బోనాలతో ఆల యానికి బయలు దేరారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపి బోనాలు సమర్పించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో తయారు చేసిన నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా వెల్లుల్ల రోడ్డులోని జీబు ఆటో, టాటామ్యాజిక్ నాయకులు గ్రామంలోని పూర్వ వీధుల గుండా డబ్బు చప్పుల మధ్య ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పిం చారు. అనంతరం గ్రామ దేవత పెద్దమ్మతల్లి, కొండస్వామి, బేతాళుడును దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సంఘం సభ్యులతో సహపక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి నాయకులు, జీబు ఆటో, టాటామ్యాజిక్ నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

మల్లాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా జరిపించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణాన్ని గ్రామాభివృద్ధి, ఆలయాభివృద్ధి కమిటీ, మహిళ సంఘాలు, యువజన సంఘాలు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఊరేగింపుగా తీసుకొచ్చిన స్వామి వారి ఉత్సవ మూర్తులను ఆలయంలో ఏర్పాటు చేశారు.

అనంతరం వేదపండితుల మంత్రోత్సవాల మధ్య స్వామి వారి కల్యాణం ఘనంగా జరిపించారు. స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి, ఆలయాభివృద్ధి కమిటీ, మహిళ సంఘాలు, యువజన సంఘాలు, సభ్యులు, పలువురుఉ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

-జడ్పీ సీఈవో గౌతంరెడ్డి

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తించి వారికి సంబంధిత శిక్షకుల ద్వారా ఆయా కేంద్రాల్లో బోధన చేయాలని జడ్పీ సీఈవో గౌతంరెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లాలో నవభారత్ సాక్షరతా కార్యక్రమంపై గురువారం జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాక్షరతా కార్యక్రమంపై జిల్లాలోని సంబంధిత అధికారులకు శిక్షణ సిబ్బందికి వర్చువల్‌గా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లాలోని 20మండలాల విద్యాధికారులు, ఏపిఎంలు, స్వయం సహాయక సంఘాల లీడర్లు, పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ గౌతంరెడ్డి మాట్లాడుతూ విద్య అనేది జీవితంలో అత్యంత విలువైనదని విద్యతోనే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ రఘువరణ్, డీఈఓ రాము తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



పోసానిపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కథలాపూర్, మే8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోసానిపేటలో పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఎంపీడీఓ శంకర్‌నాయక్ పరిశీలించారు. 16 ఇండ్ల నిర్మాణాలకు లబ్దిదారులు ముందుకు రాగా పనులను కొనసాగిస్తున్నారు. అయితే పనులు కొంత మందకొడిగా సాగుతున్న క్రమంలో వేగవంతంగా చేపట్టాలని సూచించామని ఎంపీడీఓ తెలిపారు. బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణం పూర్తయితే మొదటి విడత కింద లక్ష రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. లబ్దిదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బైర సులోచన, కారోబార్ నరేశ్ ఉన్నారు.

జువ్వాడి నర్సింగరావుపై అనుచిత వ్యాఖ్యలు సహించం

-కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి

మెట్‌పల్లిటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్‌లు హెచ్చరించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుపైన, కాంగ్రెస్ కార్యకర్తలపైన కూన గోవర్ధన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేవలం పదవి కోసం పార్టీలోకి చేరి బీఆర్ఎస్‌గా తొత్తుగా వ్యవహరిస్తున్న చైర్మన్ నిజమైన కాంగ్రెస్ కార్యకర్తల గురించి మాట్లాడాటం మానుకోవాలని హితవు పలికారు. మరోమారు నర్సింగరావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదాని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నాయిని సురేష్ గౌడ్, మెట్‌పల్లి మండల యూత్ అధ్యక్షులు పుల్లూరు వెంకటేష్, నాయకులు బొడ్ల ఆనంద్, అజయ్‌రెడ్డి, ఆనంద్, ఈశ్వర్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పంపిణీ

ధర్మపురి, మే 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో 2023 లో జరిగిన బ్రహ్మోత్సవాల్లో మున్సిపల్ పక్షాన పని చేసిన 150 మంది తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్ రూ.4,92,800 అందించారు. గత రెండు ఏళ్ల క్రితం పని చేసిన 150 మంది తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికులకు డబ్బులు రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్పందించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెంటనే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుక వెళ్లారు. వెంటనే ఆయన పెండింగ్ వేతనాలు మంజూరు చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెంటనే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుక వెళ్లి రూ 8,50,000 మంజూరు చేయించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వారందరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు లేక నిలిచిన పల్లె దవాఖాన భవనం

-పట్టించుకోని అధికారులు -ఇబ్బందులు పడుతున్న రోగులు



నమిలికొండలో స్లాబ్ లెవల్‌లో నిలిచిన భవనం

కొడిమ్యాల, మే 8(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని నమిళికొండ గ్రామంలో పల్లె దవాఖాన భవన నిర్మాణం పనులు స్లాబ్ లెవల్‌లో నిలిచాయి. గత ప్రభుత్వం ఎన్.హెచ్.ఎం నిధులు 20 లక్షల రూపాయలతో పల్లె దవఖానా నిర్మాణం చేపట్టింది. గత ప్రభుత్వం వైద్యం గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువకు తీసుకరావాలన్న ఉద్దేశంతో చేపట్టిన పల్లె దవఖాన భవనాల నిర్మాణాలు ప్రభుత్వ లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ గత సంవత్సరం 2023 సంవత్సరం మార్చి 3న మండలంలోని నమిళికొండ గ్రామంలో పల్లె దవఖాన భవన నిర్మాణ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్క రించారు. సంబంధిత కాంట్రాక్టర్ స్లాబ్ లేవెల్ వరకు పనులను చేశారు. నమిళికొండలో ఊరికి దూరంగా ఉన్న నూతన గ్రామ పంచాయతీ భవనంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎం.ఎల్.హెచ్.పి ఎస్. ఉదయభాస్కర్ తెలిపారు. నమిళికొండలో అర్థాంతరగా నిలిచిన భవన నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరు తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నమిళికొండలో నిలిచిన పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులు పూర్తి చేయించాలని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను నమిళికొండ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత డీఈఈ వి. రాజిరెడ్డిని వివరణ కోరగా త్వరలో భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు

కోరుట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జువ్వాడి భవనంలో గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాట చేసిన కేకును కట్టు చేసి వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, ఎలేటి మహిపాల్ రెడ్డి, మ్యాకల నర్సయ్య, చిటిమెల్లి రంజిత్ గుప్తా, ఎంబేరి సత్యనారాయణ, మ్యాదరి లక్ష్మణ్, తునికి సాయి, చిట్యాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

●మల్యాల, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జన్మదినం సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మంద నాంపెల్లి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మల్యాలలోని సోనియా గుడి వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల, మే 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంగడి బజారులో గురువారం రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, హన్మండ్లు, గంగన్న, ముమ్మాడి స్వామి, పాపిరెడ్డి, రాజేందర్, సలాం, రవి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

కోరుట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో గురు వారం కాంగ్రెస్ నాయకులు వినతి పత్రంను అందిం చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసిన నాయకులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకపోయి పరిష్కరించాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో నష్టపోయిన పంటలను సర్వే చేసి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, రాజోజి సదానంద చారి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

-అకాల వర్షాల నేపథ్యంలో ఆందోళనలో రైతులు



మార్కెట్‌యార్డులో వరి ధాన్యం రాశుల వద్ద రైతులు

గొల్లపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో యాసంగి వరి ధాన్యం పేరుకుపోతోంది. కొనుగోళ్ల మందకొడిగా సాగుతున్నాయి. దీంతో కొందరు రైతులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన అమరగొండ కొమురవ్వ అనే మహిళ రైతు 20 రోజుల క్రితం యార్డులో వరి ధాన్యం పోశానని పేర్కొంది. అయితే, ఇప్పటి వరకు తన ధాన్యంను బస్తాల్లో నింపడం లేదని గురువారం యార్డులో బోరున విలపించింది. టోకెన్ ప్రకారం తన వంతు వచ్చిందని, తన ధాన్యం రాశి వద్ద కాంటాను హమాలీలు తూకం వేయడానికి సిద్దమవుతుంటే కొందరు బడా రైతులు వచ్చి దౌర్జన్యంగా ఎలక్ట్రానిక్ కాంటాలను ఎత్తుకెళ్లి తమ ధాన్యంను తూకం వేయించుకుంటున్నారని ఆరోపించింది. యార్డులో సామాన్య రైతులకు కష్టాలు తప్పడం లేదని, బడా రైతుల ధాన్యం ఎప్పటికప్పుడు తూకం వేసి మిల్లులకు వెళ్తుండగా తమ లాంటి సామాన్య రైతుల ధాన్యం రోజుల తరబడి యార్డులో మూలుగుతుందని కన్నీళ్లపర్యంతమైంది. ఇప్పటికైనా సంబంధిత మార్కెట్ యార్డు అధికారులు స్పందించాలని మహిళా రైతు వేడుకుంది.

ఆర్థికసహాయం

మల్యాల, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేటకు చెందిన రాధిక అనే మహిళ కుమారుడు అనారోగ్యంతో బాధపడుచుండడంతో శ్రీదుర్గ భవాని హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు వైద్యఖర్చుల కోసం రూ.పది వేలు అందజేశారు. సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

కోరుట్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని గురువారం గ్రామస్థులు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతి పత్రంను అందించారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడారు. గ్రామంలోని వేములవాడ-కోరుట్ల రహదారిని అనుకోని గ్రామంలోకి వెళ్లే బైపాస్ రోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే రోడ్డును సీసీ రోడ్డుగా వేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ముత్యం రెడ్డి, మల్లయ్య, మహేందర్, రాజిరెడ్డి, చిన్న మల్లయ్య, నర్సయ్య, మలేశంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ధర్మపురి, మే8 (ఆంధ్రజ్యోతి): నరసింహ స్వామి నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు గురువారం పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, జడ్‌సీ డాక్టర్ రామకృష్ణ, పిన్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు

కథలాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూడు సింగిల్ విండోల ఆధ్వర్యంలో గురువారం నాటికి 1.55 లక్షల క్వింటాళ్ళ వరిధాన్యం కొనుగోలు చేసినట్టు సీఈఓలు రాంప్రసాద్, అరుణ్, విజయ్ తెలిపారు. సిరికొండ విండో పరిధిలోని రెండు కేంద్రాల్లో 19 వేలు, గంభీర్‌పూర్ పరిధిలోని నాలుగు కేంద్రాల్లో 35 వేలు, భూషణరావుపేట పరిధిలోని 12 కేంద్రాల్లో లక్ష క్వింటాళ్ళ ధాన్యం కొనుగోళ్ళు జరిపామన్నారు.